క్లుప్తంగా

దివ్యాంగులకు రుణాలు



నెల్లూరురూరల్ : జిల్లాలో 26 మంది దివ్యాంగులకు స్వయం ఉపాధి ఏర్పాటు కోసం రూ.74,57,500 చెక్కులను కలెక్టరేట్ శంకరన్ హాల్లో జేసీ కార్తీక్ గురువారం అందజేశారు. విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సహాయ సంస్థ జిల్లా మేనేజర్ మహమ్మద్ అయూబ్ పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు



నెల్లూరు(బృందావనం) : మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో హుండీ కానుకల లెక్కింపును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి 2 నుంచి ఏప్రిల్ 17వ తేదీ వరకు భక్తులు కానుకల రూపంలో రూ.8,02,323 నగదు, 7.700 మిల్లీ గ్రాముల బంగారం, 139 గ్రాముల వెండిని సమర్పించారన్నారు. పర్యవేక్షణాధికారిగా వేదగిరి లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఈఓ గోపి వ్యవహరించారు.

ఆర్థిక సాయం అందజేత



నెల్లూరు సిటీ : తిరుపతికి చెందిన సుమతి అనే దివ్యాంగురాలికి ఐకేర్ మిషన్ ఉన్నత చదువుల నిమిత్తం ఆర్థిక చేయూతనిచ్చింది. నెల్లూరు ఆర్టీసీ డిపో వద్ద రూ.15 వేల చెక్కును సుమతికి ఐ కేర్ మిషన్ సభ్యులు దాడి విక్రమ్, ఉప్పలూరి అభినందన్, తోట శ్రావణ్‌కుమార్‌లు అందజేశారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన ఐసీడీఎస్ పీడీ



అరుణమ్మతో పీడీ సువర్ణ


నెల్లూరు (పొగతోట) : ఐసీడీఎస్ పీడీగా బాధ్యతలు చేపట్టిన సువర్ణ జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మను మర్యాదపూర్వకంగా కలిశారు. జెడ్పీ కార్యాలయంలో గురువారం కలిసి వివిధ అంశాలపై చర్చించారు.

ఏసీ బస్టాండ్ ప్రారంభం



నెల్లూరు సిటీ : రూరల్ నియోజకవర్గంలోని 28వ డివిజన్ అయ్యప్పగుడి సెంటర్ వద్ద ఏసీ బస్టాండ్‌ను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గురువారం దివ్యాంగునితో ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, భానుశ్రీ పాల్గొన్నారు.

సినీ గాయని సునీత సందడి



కొడవలూరు : నార్తురాజుపాళెంలోని శ్రీవెంకటేశ్వర విద్యాసంస్థల్లో జరిగిన టెక్నికల్ ఫెస్ట్‌లో ప్రముఖ సినీ గాయని సునీత గురువారం సందడి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య ద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేలా బోధన ఉండాలన్నారు. పిల్లలతో గడిపేందుకు తల్లిదండ్రులు సమయం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్, గౌరవాధ్యక్షురాలు శ్రీలక్ష్మి, ప్రిన్సిపల్ సి.ప్రకాష్‌రావు, ఏఓ కె.గిరీష్‌కుమార్ పాల్గొన్నారు.

గీతాంజలిలో రక్తదాన శిబిరం

కోవూరు : గంగవరంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం, రెడ్‌క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సందీప్‌కుమార్ మాట్లాడుతూ ఈ శిబిరంలో 300 యూనిట్ల రక్తాన్ని రెడ్‌క్రాస్ సొసైటీకి ఇచ్చినట్లు తెలియజేశారు.

తవ్వారు.. వదిలేశారు..

- భూగర్భ డ్రెయినేజీ పనులతో అంతర్గత రోడ్లు అస్తవ్యస్తం
- రాకపోకలకు అవస్థలు
- గాయాలపాలవుతున్న ద్విచక్ర వాహనదారులు

అధికారుల నడుమ సమన్వయ లోపం స్థానికుల పాలిట శాపంగా మారింది. రాకపోకలకు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆయా ప్రాంతాల వాసులు వాపోతున్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా అంతర్గత రహదారులు తవ్వి తరువాత పట్టించుకోకపోవడంతో రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి.





మారుతీనగర్‌లో భూగర్భ డ్రైనేజీ పనుల తర్వాత అస్తవ్యస్తంగా మారిన రోడ్డు

నెల్లూరు(బారకాసు) : నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో గతంలో రూ.560 కోట్లతో మొత్తం 427 కి.మీ మేర భూగర్భ డ్రెయినేజీ పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఇప్పటివరకు 397 కి.మీ మేర పనులను పూర్తి చేశారు. ఇంకా నగరంలోని ఉమ్మారెడ్డిగుంట, హరనాథపురం, అనగుంట లేఅవుట్, చంద్రమౌళినగర్ ప్రాంతాల్లో మొత్తం 30 కి.మీ పనులు చేయాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ఈ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. జరుగుతున్న పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయి. ఇందుకు కారణం సంబంధిత కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం నుంచి చేసిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడమే. ఇప్పటికే రూ.80 కోట్లు ప్రభుత్వం నుంచి కాంట్రాక్టర్‌కు రావాల్సి ఉండగా వాటి కోసం ఎదురు చూస్తున్నారు. అవి వస్తే తప్ప మిగిలిన పనులు ప్రారంభించే పరిస్థితి కనిపించడం లేదు.

రోడ్లు లేక అవస్థలు

భూగర్భ డ్రెయినేజీ పనులు చేపట్టిన ప్రాంతాల్లో రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు రాకపోకలకు అనేక అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా ద్విచక్ర వాహనదారులు ఆయా రోడ్లపై ప్రయాణిస్తూ అదుపు తప్పి కిందపడి గాయాలపాలవుతున్నారు. భూగర్భ డ్రెయినేజీ పనులు పూర్తి కాగానే టెస్టింగ్ చేసి అంతా బాగుందని అనుకున్న వెంటనే సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టాలి. అయితే నగరంలోని నాలుగో డివిజన్ మారుతీనగర్ మొదటి వీధిలో 20 రోజుల క్రితం భూగర్భ డ్రెయినేజీ పనులు పూర్తి చేసి వదిలేశారు. ఆ తరువాత చేపట్టాల్సిన ట్రయల్‌రన్ చేపట్టకుండా కాలయాపన చేస్తున్నారు. ఇలా ఎంత కాలమని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. త్వరితగతిన సిమెంట్ రోడ్డు వేస్తే రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా హాయిగా ప్రయాణం చేసేందుకు వీలుంటుందని స్థానికులు అంటున్నారు. లేకుంటే నిత్యం ప్రమాదాల బారిన పడి గాయాలపాలవడం జరుగుతోందని అక్కడి ప్రజలు వాపోతున్నారు. ఇలాగే ఉంటే రానున్న వర్షాకాలంలో ఇక్కడి రోడ్డులో ప్రయాణం నరకంగా ఉంటుందన్న అభిప్రాయాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పబ్లిక్ హెల్త్ విభాగం డీఈఈ జానకీరామ్‌ను ఫోన్‌లో సంప్రదించగా నెల్లూరు నగరంలో భూగర్భ డ్రెయినేజీ పనులు దాదాపు 85 శాతానికిపైగా పూర్తయిందని, మిగిలిన పనులు కూడా త్వరలోనే పూర్తి చేసేలే చర్యలు చేపడుతామన్నారు. నగరంలోని నాలుగు ప్రాంతాల్లో దాదాపు 30 కి.మీ మేర భూగర్భ డ్రెయినేజీ పనులు చేయాల్సి ఉందని, ప్రస్తుతం నాలుగో డివిజన్ మారుతీనగర్‌లో భూగర్భ డ్రెయినేజీ పని పూర్తయిందన్నారు. అయితే అక్కడ ట్రయల్‌రన్ (టెస్టింగ్) పూర్తి చేసి రోడ్డు వేసేందుకు నెల నుంచి రెండు నెలల సమయం పడుతుందని సమాధానం ఇచ్చారు.

బాగు చేయాలి



మారుతీనగర్ మొదటి వీధి నుంచి న్యూకాలనీ, జాకీర్‌హుస్సేన్ నగర్‌కు నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. అలాంటిది ఇటీవల భూగర్భ డ్రెయినేజీ పనులు చేసి రోడ్డును తవ్వేయడంతో అస్తవ్యస్తంగా తయారైంది. రోజు బైకులలో ప్రయాణించే వారు కిందపడి గాయాలపాలవుతున్నారు. వీలైనంత త్వరగా సిమెంట్‌రోడ్డు వేసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలి. లేకుంటే నిత్యం ప్రజలు అవస్థలు పడాల్సిందే.

– షాజహాన్, న్యూ కాలనీ

ప్రజలకు అండగా వైఎస్సార్‌సీపీ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని పార్టీ నగర ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక గుప్తా పార్క్ సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ నేత షఫీ ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకరమని తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీ ఆధ్వర్యంలో నగర నియోజకవర్గంలో మరిన్ని చలివేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మజ్జిగను అందజేస్తున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

జనరిక్ మందులను సద్వినియోగం చేసుకోవాలి

నెల్లూరురూరల్ : ప్రజలు జనరిక్ మందులను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ అన్నారు. ఆయన నగరంలోని గుంటబడి పక్కన ఉన్న జనరిక్ మెడికల్ దుకాణాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రతి పేదవాడికి తక్కువ ధరకు మందులు అందాలనే సంకల్పంతో దేశంలో 39 వేల జనరిక్ మందుల షాపులను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. పార్టీ నేతలు హేమంత్‌కుమార్, పెంచలయ్య, సత్య, కుమార్, సుందరం, చక్రి, సుధీర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం రేపు

నెల్లూరుసిటీ : రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీఓ శైలేంద్రకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. అన్నిశాఖల అధికారులు పాల్గొనాలని సూచించారు.

న్యాయవాది గుమస్తాల సంఘం ఎన్నిక

నెల్లూరు (లీగల్) : న్యాయవాది గుమస్తాల సంఘం అధ్యక్షుడిగా కె.వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయవాది గుమస్తాల సంఘం కార్యాలయంలో గురువారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా యు.ఆంజనేయులు, కార్యదర్శిగా జి.నాగేశ్వరావు, కోశాధికారిగా టి.సుధాకర్‌తో పాటు మరో ఆరుగురు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రశాంత జిల్లాలో అశాంతి

- అప్రమత్తమైన పోలీస్ శాఖ
- జిల్లావ్యాప్తంగా వాహన తనిఖీలు

నెల్లూరు(క్రైమ్): ప్రశాంత జిల్లాలో క్రమేపీ అశాంతి నెలకొంటోంది. వరుస హత్యలు, హత్యాయత్నాలు జిల్లా వాసులను ఉలిక్కిపడేలా చేస్తున్నాయి. ప్రజలు బయట తిరగాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులపై గత ప్రభుత్వ హయాంలో ఉక్కుపాదం మోపడంతో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నేరాలు పెరుగుతున్నాయి. రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులను అధికార పార్టీ నేతలు ప్రోత్సహిస్తుండటంతో వారిపై పోలీసుల పర్యవేక్షణ తగ్గింది. ఆరు రోజుల వ్యవధిలో నగరంలో మూడు హత్యలు, హత్యాయత్నాలు చోటుచేసుకున్నాయి. వేర్వేరు ప్రాంతాల్లో రెండు హత్యలు బుధవారం రాత్రి చోటుచేసుకోవడం జిల్లా వ్యాప్తంగా కలకలం రేకెత్తించింది. దీంతో పోలీస్ యంత్రాగం అప్రమత్తమైంది. నేరాల కట్టడికి పటిష్ట చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో వాహన తనిఖీలను ఏఎస్పీ సౌజన్య ఆదేశాల మేరకు గురువారం రాత్రి చేపట్టారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేపట్టారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. రౌడీషీటర్లు, పాతనేరస్తుల కదలికలపై నిఘా పెంచారు. మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లను నిర్ణీత వేళల్లోనే మూసేసేలా చర్యలు చేపట్టారు. రోడ్లపైకి అర్ధరాత్రి వస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. అర్ధరాత్రి వరకు తనిఖీలు కొనసాగాయి.

ఈ-వేస్ట్‌తో ప్రోత్సాహకాలు

నెల్లూరు(అర్బన్) : స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మరమ్మతులకు గురై పనికిరాని ఈ-వేస్టు వ్యర్థాలైన టీవీ, ఫ్రిడ్జ్, ల్యాప్‌టాప్, కంప్యూటర్, సెల్‌ఫోన్, చార్జర్, హీటర్లు, బల్బులు, స్కానర్లను అందజేసి తగిన విధంగా ప్రోత్సాహకాలు పొందాలని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నెల్లూరు విభాగ పర్యావరణ ఇంజినీర్ అశోక్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం తన కార్యాలయంలో మాట్లాడారు. ఈ-వ్యర్థాలు పెరిగిపోవడంతో వాటిని పర్యావరణ హితంగా శాస్త్రీయ పద్ధతిలో నిర్వీర్యం చేసేందుకు కడప పట్టణానికి చెందిన హోంలాండ్ ఇంజినీర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందన్నారు. అందులో భాగంగా నగరపాలక సంస్థ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 19న ఉపయోగంలో లేని ఎలక్ట్రానిక్ పరికరాలను సేకరించే కేంద్రాన్ని నగరంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. నెల్లూరుతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, దుకాణాలు, పరిశ్రమలలో నిరుపయోగంగా ఉన్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తీసుకురావాలని కోరారు. బరువు ఆధారంగా ప్రోత్సాహకాన్ని ఇస్తున్నామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకుని పర్యావరణ పరిరక్షణకు సహకారమివ్వాలని కోరారు.

పేరుకుపోయిన చెత్త.. కదలని మురుగు

నెల్లూరు(అర్బన్) : దర్గామిట్ట బిగ్ బజారు ఎదురుగా రామ్‌నగర్‌లోని మసీదు వద్ద ఉన్న పలు వీధుల్లో కాలువలు చెత్తతో పేరుకుపోయాయి. ఫలితంగా మురుగు ముందుకు కదలడం లేదు. అంతే కాకుండా పలు నివాసాల్లోని పైపుల్లోకి మురుగు బ్యాక్ వాటర్‌గా వస్తోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఫలితంగా ఆప్రాంతంలో పెద్ద ఎత్తున దుర్గంధం వెలువడటంతో స్థానికులు ముక్కుమూసుకుని ఇళ్లలో ఉంటున్నారు. మరోవైపు దోమలు పెద్ద సంఖ్యలో పెరిగిపోయి ప్రజలను ఆరు బయట కూర్చోనీయడం లేదని అక్కడి ప్రజలు వాపోతున్నారు. డ్రైనేజీ కాలువలను క్లీన్ చేయాలంటూ మున్సిపల్ శానిటరీ అధికారులకు ఎన్ని దఫాలు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు.



రామ్‌నగర్ మసీదు వీధి ప్రాంతంలో మురుగు కాలువల దుస్థితి

మెరిట్, రోస్టర్ విధానంలో పదోన్నతులు ఇవ్వాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

నెల్లూరు(అర్బన్) : మెరిట్ కమ్ రోస్టర్ విధానంలో మాత్రమే ప్రమోషన్లు ఇవ్వాలని పలువురు ఉపాధ్యాయులు బీటీఏ(బహుజన టీచర్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీటీఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మణిసుబ్బు, ప్రసాద్‌లు మాట్లాడారు. ప్రమోషన్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా ఉపాధ్యాయులకు మేలు జరగాలంటే ప్రస్తుతం కొనసాగిస్తున్న విధానమే సరైందన్నారు. అయితే ప్రభుత్వం ఆ పద్ధతికి తిలోదకాలు ఇచ్చేందుకు పూనుకోవడం దారుణమన్నారు. నేడు ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మెరిట్ లిస్టులు తయారు చేయడం సిగ్గు చేటన్నారు. ఇలా చేసిన మెరిట్ లిస్టును తక్షణమే రద్దు చేసి సీనియారిటీ జాబితాను సిద్ధం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోజ్‌కుమార్, లక్ష్మయ్య, బీసీ చెంచయ్య, చిన్నయ్య, ఎజ్రా, శ్రీనివాసులు, పవన్ కుమార్, రాజశేఖర్, రాంబాబు, నరసింహులు, రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు



51వ డివిజన్‌లో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న అదనపు కమిషనర్ నందన్

- అదనపు కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు) : చెత్తరహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ఎస్‌ఎంసీ వాహనాలకు మాత్రమే అందజేయాలని అదనపు కమిషనర్ నందన్ సూచించారు. శానిటేషన్ విభాగాధికారులు, సిబ్బంది బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ఉండేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, అప్పటికీ రోడ్లపై చెత్త వేసేవారికి జరిమానా విధించాలని ఆదేశించారు. పారిశుద్ధ్య పర్యవేక్షణలో భాగంగా స్థానిక 51వ డివిజన్ రైల్వేఫీడర్స్ రోడ్డు, 52వ డివిజన్ రంగనాయకులపేట తదితర ప్రాంతాల్లో అదనపు కమిషనర్ గురువారం పర్యటించారు. రోడ్లపై ఉన్న పిచ్చి మొక్కలు, ముళ్లపొదలు, ఇతర వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా పారిశుద్ధ్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత తప్పకుండా జరపాలని సూచించారు. రోడ్డు ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. భవన నిర్మాణ సామగ్రి రోడ్లను ఆక్రమించకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ సామగ్రి వీధులకు అంతరాయం కల్పిస్తుంటే జరిమానా వసూలు చేయాలన్నారు. అనుమతుల ప్రకారం మాత్రమే భవన నిర్మాణాలు జరిగేలా పర్యవేక్షించాలని, అనుమతుల్లేని నిర్మాణాలను వెంటనే ఆపివేయాలని ఆదేశించారు.

పరిశోధనలతోనే ఆధునిక వైద్యం

నెల్లూరు(అర్బన్) : నూతన పరిశోధనలతోనే సమాజంలో పెరుగుతున్న జబ్బులకు ఆధునిక వైద్యం అందించవచ్చని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కాలేషాసాహెబ్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేస్తున్న 60 మంది వైద్య విద్యార్థులకు పరిశోధనాత్మక పద్ధతులు-నూతన వైద్య ఆవిష్కరణలు అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని ఆయన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ప్రజలు చెల్లించే పన్నులతోనే చదువును అభ్యసిస్తారన్నారు. ఒక్కో వైద్య విద్యార్థిపై ప్రభుత్వం లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. ఇందుకు సార్థకత చేకూరాలంటే విద్యార్థులు కష్టపడి చదువుతూ వైద్యశాస్త్రంపై అవగాహన పెంచుకోవాలని కోరారు. వైద్యంలో నైపుణ్యాలు సాధించి రోగులకు మంచి చికిత్సలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ గోవిందు మెమెంటోను డాక్టర్ కాలేషాసాహెబ్‌కు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ నాగరాజమన్నార్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యశాస్త్రంలో పరిశోధనాంశాలపై వివరిస్తున్న డాక్టర్ కాలేషా సాహెబ్

ఆనం విజయకుమార్‌రెడ్డి పరామర్శ

నెల్లూరు సిటీ : వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాసరావు తల్లి పద్మావతికి సర్జరీ చేయడంతో అపోలో ఆస్పత్రిలో వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి గురువారం పరామర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్, మాజీ కార్పొరేటర్ మదన్‌మోహన్‌రెడ్డి, నాయకులు శ్యామ్‌సింగ్, చంద్రశేఖర్, ఆదిరెడ్డి, రమాదేవి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కందమూరులో పోషణ్ పక్వాడా



నెల్లూరు సిటీ : రూరల్ మండలంలోని కందమూరులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా పక్షోత్సవాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగలక్ష్మి, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

కొడవలూరు: అంబేడ్కర్ ఆశయాల సాధనకు సమైక్యంగా కృషి చేద్దామని ఎంఈఓలు జి.వసంతకుమారి, ఎన్.అంకయ్య పిలుపునిచ్చారు. నార్తురాజుపాళెంలోని ప్రాథమిక పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ చలపతిశర్మ, పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి.శ్రీహరి, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.పుట్టయ్య, పి.తిరుపాలు, జిల్లా కార్యదర్శులు ఖాజావలీ, ఆర్.శైలజ, మండల నాయకులు సి.మోహన్‌రావు, తాటిపర్తి వెంకటేశ్వర్లు, ఖాజా మస్తాన్, గౌస్‌బాషా, కీర్తన పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ వసంతకుమారి

ఘనంగా ఐక్య ప్రభురాత్రి భోజనం



ది యునైటెడ్ బాప్టిస్టు చర్చిలో..

నెల్లూరు(బృందావనం) : నగరంలోని పొదలకూరు రోడ్డు ది యునైటెడ్ బాప్టిస్టు చర్చిలో 'ఐక్య ప్రభురాత్రి భోజన ఆరాధన'ను గురువారం ఘనంగా నిర్వహించారు. ఎలమవారిదిన్నె షెకీనా గాస్పెల్ ప్రేయర్ ఫెలోషిప్ పాస్టర్ రెవరెండ్ కె.సాల్మన్‌రాజు వాక్యోపదేశం చేశారు. ది యునైటెడ్ బాప్టిస్టు చర్చి పాస్టర్ రెవరెండ్ ఎంఎం షారోన్, రెవరెండ్ డేవిడ్‌దయాసాగర్, ఎ.ప్రభుకుమార్, డాక్టర్ రాజశేఖర్‌దాసరి, రూపస్ కమలాకర్, కె.శ్యామ్యూల్‌కుమార్, కె.అబ్రహం, పి.మనోరంజితమ్మ, పాస్టర్లు పాల్గొన్నారు.